


రాష్ట్ర స్థాయి హాకీ క్రీడలకు గిరిజన విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విజయనగరం విజ్జీ స్టేడియంలో శనివారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హాకీ జిల్లా స్థాయి పోటీల్లో మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కొత్తగూడ విద్యార్థులు అండర్ - 14 బాలుర విభాగంలో ఆరిక నవీన్‌కుమార్, మీనక చింటూ నవంబర్ 8 నుంచి 11 వరకు అనకాపల్లిలో జరగబోయే క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. అలాగే అండర్-17 బాలుర విభాగంలో ఆరిక శివ నవంబర్ 3 నుంచి 5 వరకు నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి హాకీ క్రీడలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ మాధవరావు తెలిపారు.

21న కలెక్టర్ గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 21న సోమవారం పోలీసుల అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం సీతంపేట ఐటిడిఎలో నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ హాజరుకావడం లేదని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీవెన్స్ కార్యక్రమం ఐటిడిఎ ఆధ్వర్యంలో యధావిధిగా జరుగుతుందని తెలిపారు. కావున ఈ విషయాన్ని గిరిజన ప్రజలు గమనించాలని పిఒ కోరారు.

పుష్పశ్రీవాణి ఎస్‌టినే : హైకోర్టు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి ఎస్‌టి అని హైకోర్టు తీర్పు వెలువరించింది. ఆమె ఎస్‌టి కులానికి చెందిన వారు కాదని మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజుతో పాటు నిమ్మక సింహాచలం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తూ ఆమె ఎన్నిక చెల్లదని 2019లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వివాదాన్ని అన్ని విధాలా పరిశీలించిన హైకోర్టు పుష్ప శ్రీవాణి ఎస్‌టి కొండదొరగా స్పష్టీకరిస్తూ తీర్పును ఈనెల 15న వెలువరించింది. ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి మాట్లాడుతూ కోర్టుకు కావాల్సినవి వాస్తవ ఆధారాలని, అవి నిరూపించలేనప్పుడు ఇలాగే అభాసుపాలు కావడం జరుగుతుందని అన్నారు. కోర్టు తీర్పుతో కురుపాం నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు శనివారం చినమేరంగి కోటలో ఆమెకు అభినందనలు తెలిపారు.

గిరిజన సంక్షేమశాఖ ఇఇగా మణిరాజ్

కుమార్‌కు ఎస్ఇగా ఉద్యోగోన్నతి

పార్వతీపురం: గిరిజన సంక్షేమశాఖ ఇఇగా పి.కోనవలస సబ్ డివిజన్ డిఇ మణిరాజ్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పదిరోజుల క్రితం రెగ్యులర్ ఇఇగా బాధ్యతలు చేపట్టిన ఆర్వీఎస్ఎన్ కుమార్ ఉద్యోగోన్నతి పై ఎస్ఇగా బదిలీ అయ్యారు. అంతకు ముందు పని చేసిన ఇఇ శాంతేశ్వరరావు అక్రమాలకు పాల్పడిన విషయంలో సస్పెండ్ అయిన విషయం విదితమే.

అధికారుల్లేని మన్యం జిల్లా



- మూడేళ్లుగా ఇన్‌ఛార్జులతో కాలయాపన
- చుట్టపుచూపుగా వచ్చి వెళ్లిపోతున్న వైనం

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లా ఏర్పాటే అసమగ్రంగా ఉందనే ప్రచారం అప్పట్లో జరిగింది. మూడేళ్ల క్రితం గత ప్రభుత్వ హయాంలో కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా ఆవిర్భవించింది. పాత విజయనగరం జిల్లా లోని, శ్రీకాకుళం జిల్లాలోని ఏజెన్సీ మండలాలను కలిపి మన్యం జిల్లాగా నామకరణం చేశారు. కొత్త జిల్లాగా ఏర్పడిన సమయంలో పక్క జిల్లాల నుంచి అధికారులను తీసుకొచ్చి ఆయా శాఖల్లో నియమించారు. అప్పటి నుంచి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వంటి పోస్టులు తప్ప మిగిలిన అన్ని శాఖల లకూ ఇన్‌ఛార్జి అధికారులతోనే పరిపాలన ప్రారంభమైంది. జిల్లా స్థాయి నుంచి వచ్చి మూడేళ్లు కావస్తున్నా ఇంకా అనేక కీలకమైన శాఖలకు రెగ్యులర్ అధికారులు లేకపోవడం గమనార్హం. వైసిపి ప్రభుత్వ హయాంలో దాదాపు రెండున్నరేళ్ల పాటు జిల్లాలో పరిపాలన మొక్కుబడిగా సాగింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తోంది. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు సమపాళ్లలో అమలు చేయాలనే యోచనలో తాజా ప్రభుత్వం వున్నట్లు కనిపిస్తోంది. అయితే కీలకమైన శాఖలకు రెగ్యులర్ అధికారులు ఉంటే కానీ అభివృద్ధి పనులు సజావుగా సాగే పరిస్థితి వుండదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. మన్యం జిల్లాకు ఆయువుపట్టు లాంటి రెండు ఐటిడిఎ ప్రాజెక్టులు ఉన్నాయి. అయినా గిరిజన సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలి ఉన్నాయి. ఒకప్పుడు గిరిజనులతో కళకళలాడుతూ వుండే ఐటిడిఎ ప్రాజెక్టు కార్యాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. గిరిజనుల సమస్యలు సావధానంగా విని పరిష్కరించే నాధుడు లేకపోవడంతో ఐటిడిఎ కార్యాలయాలు నిర్మానుష్యంగా మారాయి. పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎలకు గత కొద్ది నెలలుగా రెగ్యులర్ పిఒలు లేకపోవడం, మూడు నెలలకో సారి నిర్వహించాల్సిన పాలకవర్గ సమావేశాలు జరగకపోవడంతో అవి ఉత్సవ విగ్రహాలుగా కనిపిస్తున్నాయనే చర్చ జరుగుతోంది. నెలరోజుల క్రితం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవను పార్వతీపురం ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒగానూ, పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డిని సీతంపేట ఐటిడిఎ ఇంఛార్జి పిఒగానూ ప్రభుత్వం నియమించింది. అటు కీలకమైన రెవెన్యూ, ఇటు ఐటిడిఎ పిఒగా జోడు పదవులు నిర్వహించడం యువ ఐఎఎస్ అధికారులకు సవాల్‌గా మారింది. పార్వతీపురం, పాలకొండ రెవెన్యూ డివిజన్‌ల్లో రెవెన్యూ కార్యకలాపాలను నడిపిస్తూ ఇటు గిరిజన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు నడిపించడం వారికి కత్తిమీద సాములా తయారైంది. కీలకమైన రెండు శాఖలకు అధికారులు పని చేయడం వల్ల పూర్తి స్థాయిలో ఏ శాఖకూ సంతృప్తికరమైన సేవలందించలేక పోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఐటిడిఎలకు రెగ్యులర్ ప్రాజెక్టు అధికారులు లేకపోవడమే కాకుండా గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ప్రమాణాలు మెరుగు పర్చడం, విద్యార్థుల మెనూ సక్రమంగా అమలు జరిగేలా చూడాల్సిన డిప్యూటీ డైరెక్టర్ కూడా ఇన్‌ఛార్జి అధికారులే వున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారులు గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్‌గా ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీనిపై గిరిజన సంఘాలు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే నాథుడే కరువైన పరిస్థితి ఏర్పడింది. జిల్లాకి చెందిన ఎమ్మెల్యే సంధ్యారాణి గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నా ఆ శాఖలో నెలలు తరబడి కీలకమైన పోస్టులకు రెగ్యులర్ అధికారులు లేకపోవడం చర్చనీయాంశమవుతోంది. డిఆర్‌ఒగా పని చేసిన జె.వెంకటరావు బదిలీపై వెళ్లిన తర్వాత కెఆర్‌సిసి డిప్యూటీ కలెక్టర్ కేశవనాయుడు ఇన్‌ఛార్జి డిఆర్వోగా వ్యవహరిస్తున్నారు. కొద్ది నెలల క్రితం జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి ఉద్యోగవిరమణ చేసిన తర్వాత ఆ బాధ్యతలు కూడా కేశవనాయుడుకే అప్పగించారు. వాస్తవానికి డిఆర్వో కేశవ నాయుడుకు బదిలీ అయింది. కానీ ఆయన స్థానంలో మరో అధికారి రాకపోవడంతో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ బదిలీ అయిన కేశవనాయుడును రిలీవ్ చేయడం లేదు. డ్వామా పిడి కె.రామచంద్రరావుకు బదిలీ అయినా ఆయన స్థానంలో ఇక్కడికి రావాల్సిన అధికారి రాకపోవడంతో ఆయన్ను కూడా కలెక్టర్ రిలీవ్ చేయనట్టు తెలుస్తోంది. జిల్లా పంచాయతీ అధికారి బదిలీ అయిపోవడంతో ఖాళీ అయింది. జిల్లా పంచాయతీ అధికారి బాధ్యతలను డ్వామా పీడీ నిర్వహిస్తున్నారు. జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారిగా పని చేసిన ఎంవిఆర్ కృష్ణాజీ ఉద్యోగవిరమణ చేసిన తర్వాత పాలకొండ పిఆర్ డిఇ ఇన్‌ఛార్జి డిపిఇఒగా వ్యవహరిస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారిగా సీతంపేట డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయపార్వతి పని చేస్తున్నారు. జిల్లా మలేరియా అధికారిగా విజయనగరం జిల్లా మలేరియా అధికారి మణి ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విజయనగరం జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వరరావుకే ఈ జిల్లా క్రీఢాధికారి బాధ్యతలు అప్పగించారు. మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత ఇన్‌ఛార్జుల పాలనతో మొదలై మూడేళ్లవుతున్నా అదే ఇన్‌ఛార్జుల పాలన కొనసాగుతోంది.

జిల్లాలో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన అధికారుల స్థానంలో కొత్త అధికారులను నియమించడం లేదు. బదిలీపై వెళ్లి పోయిన అధికారుల స్థానంలో కొత్త అధికారుల నియామకం జరగడం లేదు. ప్రభుత్వం ఈ జిల్లాకు బదిలీ చేసిన అధికారులు ఇక్కడకి రావడానికి ఇష్టపడడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మైదాన ప్రాంతంలో ఉన్న జిల్లాలకు పని చేసిన అధికారులు రాష్ట్రంలో మారుమూలన ఉన్న మన్యం జిల్లాకు రావడానికి మొరాయిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. జిల్లా ఏర్పాటై మూడేళ్లు కావస్తున్నా ప్రభుత్వాలు రెగ్యులర్ అధికారులను నియమించకపోవడంతో సంబంధిత శాఖల సమస్యలు సత్వర పరిష్కారానికి నోచుకోవడం లేదని జిల్లా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాన్యం లేని మన్యం జిల్లా ఏర్పాటు చేసిన గత ప్రభుత్వం దారిలో కాకుండా జిల్లాకు సమగ్ర స్వరూపం కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేయాలని మన్యం జిల్లా జనం కోరుతున్నారు.

ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, వార్డెన్‌కు షోకాజ్‌లు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో గల పాతపట్నం కేంద్రంగా కొనసాగుతున్న మెలియాపుట్టి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో సీతంపేట మండలం వంబరెల్లికి చెందిన సవర లావణ్య (12) ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, వార్డెన్ సకాలంలో స్పందించకపోవడం, అలసత్వం వహించడం వంటి కారణాలతో ప్రిన్సిపల్ కృష్ణవేణి, వార్డెన్ నాగేశ్వరికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి శనివారం తెలిపారు. అంతే కాకుండా శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు టెక్కలి ఆర్‌డిఒను విచారణ అధికారిగా నియమించినట్లు తెలిపారు.

అంతుపట్టని రాజకీయం

ప్రజాశక్తి -పాలకొండ

తెలుగుదేశం పార్టీలో మొదటి నుంచి గ్రూపు రాజకీయాలు నెలకొంటున్నాయి. గత ఐదేళ్ళుగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా పని చేసిన నిమ్మక జయకృష్ణకు, ప్రస్తుత టిడిపి ఇన్‌ఛార్జ్ పడాల భూదేవికి మధ్య విభేదాలు తారా స్థాయిలోనే ఉన్నాయి. అయితే పొత్తులో భాగంగా ఈ సీటు జనసేనకు కేటాయించడంతో ఆ టికెట్ కోసం ఇరువురు గట్టిగానే ప్రయత్నిం చారు. అయితే జయకృష్ణకు జనసేన టికెట్ కేటాయిం చగా ఆయనతో మొదటి నుంచి ఉన్న టిడిపిలో ఒక గ్రూపు, భూదేవి గ్రూపు వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. ఎన్నికల్లో తమకు వ్యతిరేకంగా పనిచేశారని పార్టీ అధినాయకత్వానికి జయకృష్ణ మద్దతు గ్రూపు ఫిర్యాదు కూడా చేసింది. భూదేవి తమను కలుపుకుంటూ వెళ్లడంలేదని పార్టీ నాయకత్వానికి తెలిపినట్లు తెలుస్తోంది. ఇప్పటికి కూడా ఇరుగ్రూపుల మధ్య విభేదాలు కొనసాగు తున్న పరిస్థితిలో మంత్రి అచ్చన్నాయుడు గ్రూపుగా ముద్రపడిన భూదేవి గ్రూపునకు మన్యం జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా నియమించడంతో పట్టుకోసం వారి ప్రయత్నాలు పెరిగినట్లు తెలుస్తుంది. జయకృష్ణ గ్రూపీయులు కూడా అచ్చన్న గ్రూపునకు పెత్తనం ఇవ్వకుండా ఉండడానికి వ్యూహాలు పన్నుతున్నట్లు తెలుస్తుంది. దీంతో రాజకీయాలు మరికొద్ది రోజుల్లో ముదిరి పాకాన పడే పరిస్థితి కనిపిస్తుందని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు : జెసి

ప్రజాశక్తి -పార్వతీపురం

పార్వతీపురం డివిజన్ పరిధిలో ముందుగా నిర్ణయించిన తేదీల ప్రకారం గ్రామసభలను నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని 8 మండలాల అధికారులతో స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పార్వతీపురం డివిజనులో ముందుగా ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం పక్కాగా గ్రామసభలు నిర్వహించాలన్నారు. ఇప్పటికే జరుగుతున్న గ్రామసభల నిర్వహణపై ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో రీసర్వేపై చేపట్టనున్న గ్రామసభల గురించి ముందుగా రైతులకు సమాచారం అందించాలన్నారు. తద్వారా రైతులంతా అందుబాటులో ఉంటారని చెప్పారు. గ్రామసభకు ముందు రెవెన్యూ రికార్డులన్ని సిద్ధం చేసుకోవాలని తెలిపారు. గ్రామాల వారీగా భూముల సర్వేపై ఆరా తీసిన ఆమె గ్రామసభల్లో రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించాలని అన్నారు. ఈ క్రమంలో రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను కూడా నమోదుచేసి, వాటిని సరిచేయాలని సూచించారు. అభ్యంతరాలు చేసిన రైతుల భూములను స్వయంగా పరిశీలించి, రీసర్వే పక్కాగా చేపట్టాలని అన్నారు. రెవెన్యూ రికార్డులు, రైతుల భూవివరాలు సరిపోయిన తదుపరి వాటిని ధ్రువీకరించాలని సూచించారు. రీసర్వేలో అలసత్వం, జాప్యం పనికిరాదని, నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జేసీ హెచ్చరించారు. సమావేశంలో పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోశ్ శ్రీవాస్తవ, డివిజన్‌లోని తహశీల్దార్లు, ఉప తహశీల్దార్లు, మండల, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ సిబ్బందికి సూచనలు చేస్తున్న జెసి శోభిక

ఇంకా డిప్యూటీ సిఎంననే భ్రమలో రాజన్నదొర

ప్రజాశక్తి- సాలూరు

ఇప్పటికీ తాను డిప్యూటీ సిఎంననే భ్రమల్లో వున్నట్లు రాజన్నదొర వ్యాఖ్యలు కనిపిస్తున్నాయని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఎద్దేవా చేశారు. శనివారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం హయాంలోనే ఇసుక, మద్యం దోపిడీ జరిగిందని, నాయకులు అడ్డగోలుగా సంపాదించారని ఆరోపించారు. సిఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారదర్శక పాలన సాగిస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో పల్లె పండగ పేరుతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. రానున్న దీపావళి నుంచి మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభమవుతుందని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం వుందన్నారు. ఈ నెల 26 నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. నియోజకవర్గంలో 50వేల సభ్యత్వ నమోదు లక్ష్యంగా పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి ఉపాధ్యక్షులు భంజ్ దేవ్, పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, మండల అధ్యక్షులు ఎ.పరమేష్, పిన్నింటి ప్రసాద్ బాబు, గుళ్ళ వేణుగోపాల్ రావు, విహెచ్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయ కమిటీ సమావేశంలో మంత్రి సంధ్యారాణి
26 నుంచి టిడిపి సభ్యత్వ నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి



మహాసభలో పాల్గొన్న సిపిఎం నాయకులు

జెఎసి డివిజన్ మహిళా విభాగం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ఎపి జెఎసి పార్వతీపురం డివిజన్ మహిళా విభాగం నూతన కార్యవర్గం ఎన్నికైనట్లు రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ పి.లక్ష్మి తెలిపారు. శనివారం ఎపి జెఎసి జిల్లా చైర్మన్ గొట్టాపు శ్రీరామ్మూర్తి, మహిళా విభాగం చైర్‌పర్సన్ సుష్మా పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర మహిళా విభాగాన్ని బలోపేతం చేసేందుకు డివిజన్ స్థాయిలో మహిళా కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే ఇంతవరకు జిల్లా చైర్పర్సన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సుష్మా పట్నాయక్ వ్యక్తిగత కారణాల వల్ల పదవికి రాజీనామా సమర్పిస్తున్న కారణంగా నూతన కార్యవర్గం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆమె స్థానంలో పార్వతీపురం తహశీల్దారు కార్యాలయములో సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న టి.అరుణకుమారిని చైర్పర్సన్‌గా కో-ఆప్ట్ చేసుకున్నట్టు తెలిపారు. అలాగే పార్వతీపురం డివిజన్ మహిళా విభాగపు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిలో చైర్‌పర్సన్‌గా డి.అపర్ణ (ఆర్‌టిసి), అసోసియేట్ చైర్‌పర్సన్‌గా బి.హేమలత (మునిసిపాలిటీ), కో-చైర్‌పర్సన్లుగా బి.ప్రమీలారాణి (కో-ఆపరేటివ్), కె.దమయంతి (కో-ఆపరేటివ్), జనరల్ సెక్రటరీగా ఎన్.సునీత (రెవెన్యూ), కార్యదర్శులుగా ఎస్.సింహాచలం (నీటి పారుదల), కె.కొండమ్మ (వైద్య ఆరోగ్య), కోశాధికారిగా ఎం.మంజూష (రెవెన్యూ) ఎన్నికయ్యారు.



కొత్తగా ఎన్నికైన ఎపి జెఎసి పార్వతీపురం డివిజన్ మహిళా కార్యవర్గ సభ్యులు

గ్రానైట్ తవ్వకాలు ఆపేందుకు ఐక్య పోరాటాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పర్యావరణానికి హాని కలిగించడమే కాకుండా, గిరిజనుల నమ్మకాలను లెక్కచేయకుండా మండలంలోని బడిదేవరకొండపై కొనసాగుతున్న గ్రానైట్ తవ్వకాల నిలుపుదలతో పాటు, గిరిజనుల భూ సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. పార్వతీపురం మండలం రంగాలగూడ, తాళ్లబురిడీ గ్రామ శాఖ మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా గ్రామ శాఖకు సంబంధించిన సీనియర్ సభ్యులు సిపిఎం జెండా ఆవిష్కరించారు. ఈ సభల్లో రెడ్డి వేణుతో పాటు జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామస్వామి, బంటు దాసు మాట్లాడుతూ ఎన్నికల హామీలు, ప్రజా సమస్యల పరిష్కారానికి జరిగే పోరాటాల్లో ప్రజలంతా కలిసి రావాలని కోరారు. ఈ శాఖా మహాసభల్లో స్థానిక సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలని తీర్మానించారు. మండలంలోని రైతులు, గిరిజనులకు నష్టం చేకూర్చే బడిదేవరకొండ గ్రానైట్ తవ్వకాలపై 2016లో ఐక్య పోరాటాల వల్ల ఆగితే ఇప్పుడు మళ్లీ ప్రభుత్వం ప్రైవేటు యజమానులకు లైసెన్స్ ఇవ్వడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తుందన్నారు. ఈ తవ్వకాలను ఆపేందుకు ప్రజలంతా ఐక్య పోరాటాలకు కలిసి రావాలని కోరుతుందని పిలుపునిచ్చారు. రావికోన పంచాయతీలో సాగు చేస్తున్న గిరిజనుల భూముల్ని ఆక్రమించి పెత్తందారులు స్వాధీనం చేసుకున్న చర్యలపై ఇప్పటికే పోరాటాలు జరుగుతున్నాయని, వాటిని ప్రజలంతా బలపర్చాలని కోరారు. గిరిజన హక్కులను, వారి స్వేచ్ఛను పాలకులు కలిస్తే తీవ్ర ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. తాళ్లబురిడిలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉన్నదని, వెంటనే రక్షిత మంచి నీటి సౌకర్యం, ఇంటింటి కుళాయి పథకాన్ని అమలు చేయాలని, సాగునీటి సౌకర్యాన్ని, పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని మహాసభ తీర్మానించింది. కార్యక్రమంలో శాఖా కార్యదర్శి నాగభూషణం, సభ్యులు శంకర్రావు, లక్ష్మణరావు, బలరాం, మండల నాయకులు పి.రాము, రాజారావు, నీలకంఠం తదితరులు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ వైద్యం అందాలి : డిఐఒ

ప్రజాశక్తి -భామిని

ప్రతి రోగికి పూర్తి స్థాయిలో ఆరోగ్య తనిఖీలు, నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ (డిఐఒ) డాక్టర్ ఎం.నారాయణ అన్నారు. ఈ మేరకు మండలంలోని భామిని, బత్తిలి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒపి రికార్డులో రోగుల ఆరోగ్య సమస్యల వివరాలు పరిశీలించి జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే వారికి నిర్వహిస్తున్న పరీక్షలు, ఆరోగ్య తనిఖీలు, చికిత్సా వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. రోగుల ఆరోగ్య సమస్యలను స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి రోజూ రోగ నిర్ధారణ పరీక్షలు ఏ మేరకు చేపడున్నారు, వాటి ఫలితాల వివరాలు ల్యాబ్ రికార్డులో తనిఖీ చేశారు. జ్వర లక్షణాలతో ఉన్న ప్రతి ఒక్కరికీ నిర్ధారణ పరీక్షలు తప్పనిసరి అని ఆదేశించారు. సిబిసి ఎనలైజర్ ద్వారా నిర్వహిస్తున్న రక్త పరీక్షల నివేదికల్లో ఎవరికైనా ప్లేట్లెట్ల సంఖ్య తక్కువగా గుర్తిస్తే వెంటనే వైద్యాధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం మందుల నిల్వలను తనిఖీ చేసి ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రల లభ్యతను పరిశీలించి అన్ని అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి నెలా ఏ మేరకు సాధారణ కాన్పులు చేపడుతున్నారని అడిగి పార్చురిషన్ రిజిస్టర్లో తనిఖీ చేసి పిహెచ్‌సిలో ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం బామిని కెజిబివి పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ దామోదర్, డా. సంతోషి లక్ష్మి, సూపర్వైజర్లు కెజిబివి పాఠశాల ఇంచార్జి శారద తదితరులు పాల్గొన్నారు.

డయేరియా మరణం ఒక్కటేనట!

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పంచ పాండవులు ఎంతమంది? అంటే మంచం కోళ్ల మదిరిగా ముగ్గరే అంటూ రెండు చూపుడు వేళ్లు చూపించి ఒక్కరే అని చెప్పాడట వెనుకటి ఓ వ్యక్తి. గుర్ల మండలంలోని డయేరియా మరణాలపై సర్కారు వారి లెక్క ఈ సామెతకు అద్దం పడుతోందని పబ్లిక్ టాక్. ఒక్క గుర్ల మండలంలోనే గడిచిన వారం రోజుల్లో 8 మంది చనిపోయారు. కోట గంద్రేడులో కూడా మరో మహిళ డయేరియాతోనే మృతి చెందింది. ఈ లెక్కన డయేరియాతో ఎనిమిది మంది చనిపోగా, ఒక్క గుర్ల గ్రామంలోనే ఏడుగురు చనిపోయినట్టు లెక్క. ఈ నేపథ్యంలో మెరుగైన వైద్యసేవలపై దృష్టి సారించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు నానా తంటాలు పడుతోంది. మృతుల సంఖ్యను తగ్గించి చెప్పడానికి, ఇందుకోసం వయస్సులు తారుమారు చేయడానికి, వృద్ధులని, ఇతర అనారోగ్య కారణాలతో చనిపోయారని చెప్పడంపైనే ఎక్కువ దృష్టిసారించారని జనం చెప్పుకుంటున్నారు. ఇందుకు తగ్గట్టే శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ డయేరియా మరణాలపై లెక్కలు చెప్పారు. డయేరియాతో కేవలం ఒకే ఒక్కరు చనిపోయారని చెప్పుకొచ్చారు. ఈ సమాచారం జిల్లాలో దావణంలా పాకడంతో జనం ఒకింత ఆశ్చర్యంగా చర్చించు కుంటున్నారు. ఆ గ్రామంలో చనిపోయిన వారిలో ఒకరు మితిమీరిన మద్యం సేవించి, మరొకరు దీర్ఘకాలిక రోగంతో చనిపోయారని, మిగిలిన వారు డయేరియాతోనే చనిపోయారని, మరణించినవారిలో కొందరు గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరంలోనూ చికిత్స పొందారని గ్రామస్తులు చెబుతున్నారు. కోట గంద్రేడులో చనిపోయిన అప్పలనరసయ్యమ్మతో కలిపి మొత్తం 8మంది డయేరియా చనిపోయినట్టు ఆయా గ్రామాల ప్రజానీకం చెబుతున్నారు. రాజు తలచుకుంటే కొరడా దెబ్బలకు కొదవలేదన్నట్టు డయేరియా మరణాల సంఖ్యను దాచేయడం బాధాకరణమని జనం చర్చించుకుంటున్నారు. ఇక అధికారుల లెక్క ప్రకారం.... గుర్లలో ఒకే ఒక్క డయేరియా మరణం అనుకుంటే పైన పేర్కొన్న ప్రకారం డయేరియా లక్షణాలతో ఆరుగురు, ఇతర కారణాలతో ఇద్దరు చొప్పున గత వారం రోజుల్లో మొత్తం గుర్లలో 8మంది మరణాలు సంభించినట్టు లెక్క. ఇవన్నీ సాధారణ మరణాలు అనుకున్నా ఒకే గ్రామంలో ఇంత స్వల్ప వ్యవధిలో ఇన్ని మరణాలు ఊహించుకుంటే భయం పుడుతుంది. ఇందుకు కూడా ప్రభుత్వం బాధ్యత వహించాల్సివుంది. కానీ, అధికార యంత్రాంగం కేవలం డయేరియాకే బాధ్యత వహిస్తున్నట్టు లెక్కలు చెబుతుండడం పట్ల జనం విస్తుపోతున్నారు.



గోతులో దిగబడ్డ లారీలు

● అంతర్ రాష్ట్ర రహదారిపై నిలిచిపోయిన ట్రాఫిక్ ● ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ● తప్పని కాలి నడక

ప్రజాశక్తి - కొమరాడ


మండలంలోని గంగరేగువలస నుంచి కూనేరు వరకు గల అంతర్రాష్ట్ర రహదారి అధ్వానంగా మారడంతో ఒడిశా-రాయగడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎఒబి సరిహద్దు ప్రాంతంలో కూనేరు, గుమడ వద్ద శనివారం వేకువజామున రెండు చోట్ల రహదారిపై లారీలు గోతులో దిగబడి పోయాయి. దీంతో లారీ రోడ్డుకు అడ్డంగా ఉండిపోవడంతో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో అటు కూనేరు వైపు ఇటు పార్వతీపురం వైపు కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో ఇరువైపు నుంచి వచ్చిన లారీలు రోడ్డుపై ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆటోలు, బస్సులు సైతం రాకపోకలకు అంతరాయం కలగడంతో ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర



రోడ్డు మధ్యలో గోతులో కూరుకుపోయిన లారీ

ఇబ్బందులు పడ్డారు. బస్సులు, ఆటోలు రాకపోకలకు ఆటంకం ఏర్పడడంతో ఎక్కడో ట్రాఫిక్ లేని వద్ద దిగి అక్కడ నుంచి నడుచుకొని ప్రయాణికులు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో తక్షణమే లారీ డ్రైవర్లు స్థానికుల సహాయంతో గోతులో దిగుబడిపోయిన లారీలను బయటకు తీసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో వాహన రాకపోకలు కొనసాగించేలా చర్యలు చేపట్టారు. రోడ్డుపై అనేక చోట్ల భారీ గోతులు ఏర్పడడంతో ఎప్పుడు ఏ లారీ గోతులు ఆగిపోతుందో తెలియని పరిస్థితిలో ఈ రహదారులు ఉన్నాయని వాహనదారులు గుగ్గులు పెడుతున్నారు.

తక్షణమే అధికారులు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తాత్కాలికంగానైనా రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులను కప్పి ట్రాఫిక్ అంతరాయంతో పాటు ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు. గతంలో రోడ్ల బాగు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో అనేక నిరసనలు చేసినా అధికారులు కనీసం గోతులు కప్పకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతుందని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి విమర్శించారు. ఈనెల 25లోగా అంతర్ రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులు పూడ్చకపోతే ఆ తర్వాత రహదారిపై నిరసన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు.



పనులు చేస్తున్న విద్యుత్తు సిబ్బంది

రామవరంలో విద్యుత్ పనులు

ప్రజాశక్తి సీతానగరం

మండలంలోని రామవరంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కిందికి వేలాడుతున్న విద్యుత్తు తీగెలు, స్తంభాలు సరి చేయడం సిబ్బంది శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఎఇ ఎ.జగన్మోహనరావు మాట్లాడుతూ మండల పరిషత్ సమావేశంలో విద్యుత్ సమస్యలపై సభ్యులు ప్రస్తావించారు. ఈ గ్రామంలో విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయని, విద్యుత్ స్తంభాలు కొత్తగా వేయాలని పలు సమస్యలను దృష్టిలో తీసుకొచ్చారు. ఈ సమస్యపై విద్యుత్ శాఖ పరిష్కరిస్తున్నామన్నారు. అంతేకాక అన్ని గ్రామాల్లో ఉండే విద్యుత్ సమస్యలు కూడా పరిష్కరించేందుకు అధికారులు, సిబ్బంది పనులు చేపడుతున్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం సక్రమంగా అమలు చేయాలని ఎంఇఒలు 1,2 డి.గౌరునాయుడు, ఆర్. ఆనందరావులు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో (బాలుర) ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థులకు వడ్డించే భోజన రుచికరంగా ఉండా లేదా ఒకసారి పరిశీలన చేయాలని వాటిలో లోటుపాట్లు ఉంటే వంట ఏజెన్సీకి చెప్పి సరి చేయాలని సూచించారు. విద్యార్థుల విద్య ప్రమాణాలపై దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులు హాజరు పట్టికను కూడా పరిశీలించాలన్నారు. యుడైస్, ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల హాజరు పట్టిక ఉపాధ్యాయులు హాజరు పట్టికను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సుంబోరొ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది, సిఆర్‌ఎంటి సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల విద్యార్థులకు స్థానిక ఈశ్వర్ హెచ్‌పి గ్యాస్ మేనేజర్ జి.సోమేశ్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు సమక్షంలో విలేజ్ ఎవేర్నెస్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను విజేతలకు అందజేశారు. అనంతరం పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి బహుమతి అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌పి గ్యాస్ సిబ్బంది కృష్ణ, శ్రీరామ్మూర్తి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని యు.వెంకంపేట పరిధిలో రైతు ఉత్పత్తి దారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ కార్యాలయంలో శనివారం వార్షిక సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కరణం చిన్నంనాయుడు, ఉపాధ్యక్షులుగా సిహెచ్ సత్తిబాబు, కోశాధికారిగా కె శంకర్రావు, జాయింట్ కార్యదర్శి కె.హరి, కోశాధికారి కె.అసిరినాయుడులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం కె.రాము, రైతు ఉత్పత్తిదారుల సంఘం సీసీ వై ఆనందరావు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు, సిబ్బంది, పాల్గొన్నారు.



నవీన్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చెస్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన చెస్ పోటీల్లో పసుపురెడ్డి నవీన్ అండర్ -14, గేదెల శ్రీకాంత్ అండర్ -17కు ఎంపిక అయ్యారు. వీరికి పాఠశాల ప్రిన్సిపల్ పి.సత్యనారాయణ, ఎస్ఎంసి చైర్మన్ డి.మణిభూర్రావు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ అండర్ 14, 17లో కూడా విజయం సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.

భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివినాడే తమ భవిష్యత్తుకు బాటలు వేయడానికి వీలుంటుందని మూలలెన్నిడి జెడ్‌పిహెచ్ పాఠశాల హెచ్‌ఎం, జాయ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు బివికె సంజీవరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్‌పై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో నిలిచిన నాడే మీ జీవితాలకు మీరే హీరోలని, మన జీవితాలకు మనమే బాధ్యులం కావాలని చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి వరం, వైస్ ప్రిన్సిపల్ రామయ్య, కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ స్వరూప, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న స్థానిక నాయకులు

శ్మశాన వాటికను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలో గజాల ఖానా దగ్గర ఉన్న శ్మశాన వాటికను ఎమ్మెల్యే జయకృష్ణ శనివారం పరిశీలించారు. శ్మశాన వాటిక దగ్గర గత కొన్ని సంవత్సరాలుగా గ్రామస్తులు పడుతున్న ఇబ్బందుల గురించి ఎమ్మెల్యేతో స్థానికులు చెప్పడంతో ఆయన పరిశీలించారు. వర్షం వచ్చిందంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని శ్మశాన వాటిక దగ్గరికి మరణించిన వాళ్ళని తేవాలన్నా, ఖననం చేయాలన్నా చాలా ఇబ్బంది పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కావున వీధులలో పాటు నగర పాలకొండ ఇదే శ్మశాన వాటికను, దీనిని ఎలాగైనా అభివృద్ధి చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్మశాన వాటిక అభివృద్ధికి వెంటనే చర్యలు తీసుకుంటానని శ్మశాన వాటికను సుందరమంగా తీర్చిదిద్దేందుకు వెంటనే ప్రభుత్వ పెద్దలకు తెలియజేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

అంపోలు కుటుంబానికి పరామర్శ

పాలకొండ నగరపంచాయతీ పరిధిలో వడమ గ్రామంలో ఇటీవల అంపోలు వెంకట నాయుడు అనారోగ్యంతో చనిపోవడంతో టిడిపి మాజీ కౌన్సిలర్ అంపోలు శ్రీనివాసరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శనివారం పరామర్శించారు. ఇంట్లో పెద్ద దిక్కుగా ఉండే తండ్రిని కోల్పోవడం చాలా బాధాకరమని, తండ్రి లేని లోటు తీర్చలేమని ఎమ్మెల్యే ఆ కుటుంబాన్ని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి టౌన్ ప్రెసిడెంట్ గంట సంతోష్, అంపోలు చిన్న శ్రీను, సుంకర అనిల్ దత్, బోగాది వెంకటరమణ, కొండదాడి రాజేష్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

హోం కంపోస్టింగ్‌పై అవగాహన

రాజాం: పట్టణంలో మహిళలకు హోమ్ కంపోస్టింగ్‌పై మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కంపోస్ట్ అనేది మొక్కల ఎరువుగా, నేల భౌతిక, రసాయన, జీవ లక్షణాలను మెరుగుపరచడానికి ఉపయోగించే సేంద్రీయ పదార్థమన్నారు. ఇళ్లలో ఉండే తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి కేవలం పొడి చెత్తను మాత్రమే చెత్త బండికి ఇవ్వాలని, తడి చెత్తను వారి వారి ఇళ్లల్లోనే కంపోస్టింగ్ ఎరువుగా ఎలా తయారు చేసుకోవాలో తెలిపారు. పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకునే బాధ్యత మనపై ఉందన్నారు.

మినీ గోకులం షెడ్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని విక్రంపురం, బిటివాడ గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం మినీ గోకులం షెడ్లు ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన చేసినట్టు ఎపిఒ జి.సత్యంనాయుడు తెలిపారు. ఒక్కొక్క గోకులం షెడ్లకు రూ.2.3లక్షలతో ఉపాధి నిధులతో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. నడిమికెళ్లలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదేశాల మేరకు పల్లె పండుగ భాగంగా రహదారికి భూమి పూజ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎస్ నరసింహులు, ఎల్ చంటి, సర్పంచ్ ప్రతినిధి మాచర్ల వెంకటరమణ, గీతా నందీశ్వరరావు, అనిల్ కుమార్, యామక అప్పలనాయుడు, డి శ్రీనివాస్, ఇంజనీరింగ్ కన్సల్ట్ కష్ణ ప్రసాద్, గ్రామ పెద్దలు, టెక్నికల్, ఫీల్డ్ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని దయానిధిపురం, రంగంపేట, రామవరం, పనుగుపేట, లచ్చయ్యపేట తదితర గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, ఎపిఒ భాను పలు కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామంలో మంజూరయ్యే బిటి, సిసి రోడ్లు, ఇంకుడు గొయ్యిల తవ్వకం తదితర పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామ సర్పంచులు టి.రామారావు, వై.రామారావు, పి.సత్యమణి,



కురుపాం: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండగ కార్యక్రమాన్ని శనివారం పలు గ్రామాల్లో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. పలుచోట్ల అభివృద్ధి పనులకు టిడిపి నాయకులు కెవి కొండయ్య, రంజిత్ కుమార్ నాయకో శంకుస్థాపన చేశారు. ఇక నుంచి గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు.. సర్పంచ్ ఐ. గౌరీశంకర్, ఇఒపిఆర్‌డి రమేష్, మండల ఇంజనీరింగ్ అధికారి నాగేశ్వరరావు, ఉఫాదిహామీ ఎపిఒ పి.బావాజీ, మాజీ సర్పంచ్ వెంపటాపు భారతి తదితరులు పాల్గొన్నారు.

గులి రాగి విస్తీర్ణం పెంచాలి

ప్రజాశక్తి - పాచిపెంట

రానున్న రబీ సీజన్లో చిరుధాన్యాల విస్తీర్ణంతో పాటుగా దిగుబడి కూడా పెరిగేలా పనిచేయాలని మండల వ్యవసాయాధికారి కె.తిరుప తిరావు అన్నారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రకృతి సేద్య ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా చోడి పంట విస్తీర్ణం పెంచడానికి వరి మాగాణిలో వరి కోతకు 15 రోజులు ముందుగా ఐదు కిలోల చోడి విత్తనాలను చల్లుకోవాలన్నారు. దిగుబడి పెరగాలంటే గులి పద్ధతిలో చోడి సాగు చేసే విధానాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. అంతేకాకుండా క్షేత్ర ప్రదర్శనలను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. గులి రాగి పద్ధతిలో సాధారణం కంటే దిగుబడులు రెట్టింపు వచ్చే అవకాశం ఉన్నందున అతి సులువైన ఈ పద్ధతిని రైతుల వద్దకు అంతా కలిసి



మాట్లాడుతున్న ఎఒ తిరుపతిరావు

తీసుకు వెళ్లాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఎకరా గులి సోడి పద్ధతిలో పండించాలంటే కిలో విత్తనం పొగాకు నారుమడిలా తయారు చేసిన ఎత్తయిన నార్మల్‌లో వేసి 10 లేదా 12 రోజుల వయసులో అడుగున్నర దూరంలో బాగా చదును చేసి దుక్కు చేసిన పొలంలో నాటుకుంటే ఎకరానికి 20 క్వింటాళ్లకు పైగా వస్తున్నట్లు నిరూపితమైందని అన్నారు. ఈ విధానానికి అత్యంత ప్రాధాన్యత రైతులకు తెలియజేయాలన్నారు. కేజీ రూ.42 మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు తెలిపాలని సూచించారు.

ఎంఆర్‌సి నిధులు మంజూరుపై హర్షం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్రవ్యాప్తంగా ఎంఇఒ కార్యాలయాల నిర్వహణకు మండల రిసోర్స్ కేంద్రాలకు రూ. 8.82 కోట్లు నిధులు విడుదల చేస్తున్నట్లు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించడం పట్ల ఎంఇఒ-1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత మూడేళ్లుగా ఎంఇఒ కార్యాలయాల నిర్వహణ నిధులు మంజూరు కాకపోవడంతో ఎంఇఒలు ఇబ్బందులుపడుతున్నారని ఇటీవల విద్యా శాఖ మంత్రికి ప్రాతినిధ్యం చేశామన్నారు. దీంతో మంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని ఎంఆర్‌సి నిర్వహణ నిధులు 50 శాతం విడుదల చేస్తున్నట్లు ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పాఠశాల నిర్వహణ గ్రాంట్లు కూడా విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అలాగే ఎంఇఒలు ఎదుర్కొంటున్న పలు ముఖ్యమైన సమస్యలపైనా, విద్యా వ్యవస్థలో తీసుకు రావల్సిన సంస్కరణలపైనా త్వరలోనే విద్యాశాఖ మంత్రిని కలిసి వివరిస్తామని సింహాచలం పేర్కొన్నారు.

ఉదయం ఎండ.. సాయంత్రం వాన

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాంతో పాటు పరిసర గిరిజన గ్రామాల్లో శనివారం సాయంత్రం వింత వాతావరణం చోటుచేసుకుంది. ఉదయం వేసవిని తలపి ంచేలా తీవ్రమైన ఎండ ఎక్కడంతో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు ఉక్కిరిబిక్కిరయ్యారు. అయితే మధ్యాహ్నం నాలుగు గంటలయ్యేసరికి ఆకాశం పూర్తిగా మబ్బులమయమై ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురుపాంతో పాటు పరిసర గ్రామాల్లో కురవడంతో ప్రజలకు, రైతులకు ఉపశ మనం లభించింది. చాలా రోజుల తర్వాత ఇంత పెద్ద వర్షం కురవడంతో పొట్ట దశలో ఉన్న వరి పంటకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గుమ్మలక్ష్మీపురం: ఏజెన్సీలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంట పాటు భారీ వర్షం పడడంతో పంటలకు ఎంతో అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఎండలతో ఉక్కిరి బిక్కిరవుతున్న ప్రజలకు కురిసిన వర్షంతో



కురుపాం రోడ్డులో కురుస్తున్న వర్షం

ఉపశమనం పొందారు.

సీతంపేట: మండలంలోని అనేక గ్రామాల్లో కుండపోత వర్షం కురిసింది. వేకువ జాము నుంచే ఎండలు భగభగ మండి వేసవి తలపించాయి. ఎండిపోతున్న వరి పంటకు సాగునీరు కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో శనివారం సాయంత్రం ఒకసారిగా కారు మబ్బులతో వాతావరణం చల్లబడి ఏకధాటిగా గంటసేపు కుండపోత వర్షం కురిసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిఒ రద్దుపై అభినందనీయం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పాఠశాల విద్యకు విఘాతం కలిగించే జీవో 117ను వచ్చే విద్యా సంవత్సరం నుంచి రద్దు చేయడానికి ప్రభుత్వం ముందుకు వచ్చినందుకు పిఆర్‌టియు హర్షం వ్యక్తం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరాపు సూర్యనారాయణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వాలేటి తవిటి నాయుడు, కాగాన విజయ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గంట శశి కుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఉన్నత పాఠశాలలో రెండు మీడియంలు ఉండాలని, అందుకు అనుగుణంగా ఇప్పటి నుండే మాధ్యమాలను విడదీసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సూర్యనారాయణ కోరారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉన్నప్పుడే విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రతి శుక్రవారం ఉపాధ్యాయుల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేయడం విద్యారంగ అభివృద్ధికి శుభసూచకమని, అందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను అభినందించారు. మున్ముందు కూడా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విద్యాశాఖపై తనదైన ముద్ర వేయాలని పిఆర్‌టియు నాయకులు కోరారు.

డ్వాక్రా ఉత్పత్తుల పరిశీలన

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని గంగాడలో వెలుగు సంఘాల ఆధ్వర్యంలో తయారు చేస్తున్న డ్వాక్రా ఉత్పత్తులను డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనాయుడు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న విజయవాడలో గంగాడ నుంచి డ్వాక్రా ఉత్పత్తులు ప్రదర్శనకు అంతా సిద్ధంగా ఉందన్నారు. వెండి ఉత్పత్తులు తయారీలో గంగాడలోని



ఉత్పత్తులను పరిశీలిస్తున్న పీడీ సత్యంనాయుడు

మహిళలు తనదైన శైలి చూపించుకున్నారని కొనియాడారు. ఇవి చూడ్డానికి ముచ్చటగా ప్రతి విగ్రహం కనిపిస్తుందని అన్నారు. విజయవాడలో జరగబోయే ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి గంగాడ సంఘ సభ్యులు వెళ్లడం జిల్లాకు మండలానికి, జిల్లాకు పేరు తీసుకురావడమేనని అన్నారు. కార్యక్రమంలో డిపిఎం అప్పారావు, లైవ్ హుడ్ ఎపిఎం సతీష్ కుమార్, ఉన్నతి ఎబిఎన్ రామకృష్ణ, ఎపిఎం ఉమామహేశ్వరరావు, సిసి కృష్ణ, విఒఎ దాసు తదితరులు పాల్గొన్నారు.

సులభ పద్ధతిలో బోధించాలి

ప్రజాశక్తి - సీతానగరం

విద్యార్థులకు సులువు పద్ధతిలో పాఠాలు బోధించాలని, ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలని హైస్కూలు ప్రత్యేక అధికారి ఎస్.అవినాష అన్నారు. మండలంలోని గాజులవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి అవినాష్

ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. పదో తరగతి విద్యార్థులకు సులువైన పద్ధతులో బోధించి శతశాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారికి బోధించాలని సూచించారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించాలని, వెలుగుబడిన విద్యార్థులను, ఉపాధ్యాయులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలేజీల్లో మధ్యాహ్న భోజనం వెంటనే అమలు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని యువగళం పాదయాత్ర సమయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ తక్షణమే అమలు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడే ఐదు నెలలు పూర్తి అయిందని, కానీ ఇంకా ఆలస్యం చేస్తే డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదం ఉందని అన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని త్వరగా జూనియర్ కళాశాల మధ్యాహ్నం భోజనం పథకం అమలు చేయాలని కోరారు.

గడగమ్మలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని గడగమ్మలో శనివారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, జ్వరపీడితులు, మధుమేహ, రక్త పోటు తదితర రకాలైన వ్యాధులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి ఆశాజ్యోతి, ఎఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, 104సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

ప్రజాశక్తి - వీరఘట్టం

రైతు ఉత్పత్తిదారుల సంఘం నూతన కమిటీ శనివారం స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్వగ్రామం ఎం.రాజుపురంలోని క్యాంప్ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ రైతు ఉత్పత్తి సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు కరణం చిన్నంనాయుడు, ఉపాధ్యక్షులు చందక సత్తిబాబు, కార్యదర్శి కోట శంకర్రావు, జాయింట్ కార్యదర్శి కండపు హరి, కోశాధికారి కోరికన అసిరినాయుడు, ఎపిఎం కె.రాము, రైతు ఉత్పత్తిదారుల సంఘం సిసి వై.ఆనందరావు, బోర్డు డైరెక్టర్లు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని పెద్దకృష్ణరాజపురంలో ప్రభుత్వ పాఠశాలలను ఎంఇఒలు జి.జగదీశ్వరరావు, పి.బాల భాస్కరరావు శనివారం సందర్శించారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, వంట గదులు, పాఠశాలల ఆవరణ పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీషు చదివించడం, రాయించడంతోపాటు చతుర్విధ ప్రక్రియలు చేయించారు.

ఒప్పంద ఉద్యోగుల జిఒలు అమలు చేయాలి

భామిని: అర్థాంతరంగా నిలిపివేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ యాక్ట్ -30, జిఒ 114లను రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మరలా పునరుద్ధరించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒప్పంద ఉద్యోగులు కోరారు. ఈ మేరకు శనివారం భామిని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఒప్పంద ఉద్యోగులు పసుపు రిబ్బన్లు ధరించి తమ జిఒ పునరుద్ధరించాలని నిరసన తెలిపారు. జిఒ పునరుద్ధరించి రాష్ట్రంలో 3618 మంది ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు.

కోటదుర్గమ్మ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలో వెలసిన కోటదుర్గమ్మ హుండీ ఆదాయం శనివారం అధికారులు, బ్యాంక్ సిబ్బంది, ప్రజల సమక్షంలో లెక్కించారు. దసరా నవరాత్రులు సందర్భంగా ఈ నెల 3వ తేదీ నుండి 12వ తేదీ వరకు ఏర్పాటు చేసిన హుండీలు, గత నెల 26 నుండి ఈ నెల 19వ తేదీ వరకు హుండీలు లెక్కించగా 13,74,102 రూపాయలు నగదు రూపంలో, 11.5 గ్రాముల బంగారం, 470 గ్రాముల వెండి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

విజేతలకు సెంచూరియన్ అభినందనలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఇటీవల జాతీయ, రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గెలిపొందిన విజేతలకు సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డి.ఎన్.రావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో క్రీడాకారులు మరిన్ని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. క్రీడలు చదువులో ఒక భాగంగా ఉండాలన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు విశ్వవిద్యాలయం తరపున జాతీయ స్థాయి విజేతకు రూ.75 వేలు, రాష్ట్ర స్థాయి విజేతలకు రూ.50వేలు నగదు పారితోషికాన్ని అందజేస్తొన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ వెయిట్ లిఫ్టింగ్ విజేతలకు సెంచూరియన్ ఒక హబ్‌గా మారిందన్నారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో కూడా క్రీడాకారులు రాణించాలన్నారు. అనంతరం ఆయన జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించిన చుక్క శ్రీలక్ష్మిని అభినందిస్తూ రూ.5వేలు నగదు బహుమతిని అందజేశారు. క్రీడా విజేతలు శ్రీలక్ష్మి, శ్రీపాద శ్రీజ,



క్రీడాకారులను అభినందిస్తున్న అధ్యాపకులు

వి.మౌనిక, బి.ఆదినారాయణ, దాసరి చిరంజీవి, కోచ్ నక్క అర్జున్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ డైరెక్టర్, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, ఐక్యూఎసి హెడ్, డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ సన్నీడియోల్, డీన్ విజయ్‌బాబు, ప్రొఫెసర్ శాంతమ్మ, డీన్ పుష్పలత, బిబిఎ విభాగాధిపతి మోహన్‌బాబు, స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డి.నారాయణరావు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో జడ్జి తనిఖీలు

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూడాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ కోరారు. స్థానిక అంధుల, గురుకుల, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలను శనివారం సందర్శించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. నాణ్యమైన విద్యను బోధించి నాణ్యమైన భోజనాలు పెట్టాలని ఆదేశించారు.

శృంగవరపుకోట : పట్టణంలోని వసతిగృహాలను జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి శనివారం తనిఖీ చేశారు. వసతిగృహాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు.